
సాక్షి
బాపట్ల
ఆదివారం । 1 । జనవరి । 2023




సాగునీటి సమాచారం
తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1016 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజ్ వద్ద 4362 క్యూసెక్కులు నిల్వ ఉంది.



పులిచింతల నీటి నిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 45.0513 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుండి 4450 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 6200 వదులుతున్నారు.

జీరో కరోనా
గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శని వారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.



న్యూస్‌రీల్

పొత్తిళ్ల బిడ్డను ఎత్తుకెళ్లబోయి..
- పారిపోయిన మహిళా కిడ్నాపర్
- సత్తెనపల్లిలో శిశువు కిడ్నాప్ యత్నం
- వివరాల సేకరణలో పోలీసులు



సత్తెనపల్లి: శిశువు కిడ్నాప్ యత్నం కలకలం రేపిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఏరియా వైద్య శాలలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రంగా కాలనీకి చెందిన తుపాకుల రామకోటి గాజుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఏడాదిన్నర కిందట వివాహమైంది. ఆయన భార్య లక్ష్మీ తిరుపతమ్మ ఆరు రోజుల కిందట సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. శనివారం మధ్యాహ్న సమయంలో శిశువు తల్లి లక్ష్మీ తిరుపతమ్మ బడలికతో మత్తుగా ఉండి నిద్రలోకి జారుకుంది. తోడుగా వచ్చిన తోడికోడలు తుపాకుల రాజకుమారి కూడా నిద్రిస్తుండగా తల్లి పాదిలి బాలమ్మ దుస్తులు శుభ్రం చేసేందుకు బయటకు వెళ్లింది. ఇదే సరైన అదునుగా భావించిన గుర్తు తెలియని ఓ మహిళ పొత్తిళ్లలోని శిశువును చేతుల్లోకి తీసుకొని హడావుడిగా బయలుదేరింది. తల్లి నిద్రిస్తుంటే శిశువును హడావుడిగా తీసుకువెళ్లడాన్ని ఎదురుగా ఉన్న వ్యక్తి గమనించాడు. ఆయన అచ్చంపేట మండలం చామర్తి గ్రామానికి చెందిన ఏసుబాబు. తన భార్య ప్రసవం కారణంగా అక్కడే ఉండటంతో ఈ వ్యవహారాన్ని గమనించాడు. సదరు మహిళను 'ఎక్కడికి శిశువును తీసుకువెళుతున్నావంటూ' ప్రశ్నించాడు. 'ఈ బిడ్డ మీ బంధువా' అంటూ గుర్తు తెలియని మహిళ ఎదురు ప్రశ్నించడంతో 'అవునని' ఏసుబాబు సమాధానమిచ్చాడు. దీంతో శిశువును ఏసుబాబు చేతుల్లో పెట్టి అక్కడి నుంచి పరారైంది. సుమారు 35 సంవత్సరాల వయసు కలిగి ముఖానికి మాస్క్ ధరించి ఉన్న మహిళ వైద్యశాలలో శిశువును కిడ్నాప్ చేసేందుకు వచ్చి వైద్యశాలలో పరిస్థితులను గమనిస్తూ శిశువును కిడ్నాప్ చేసేందుకు యత్నించింది. మొత్తం మీద శిశువు కిడ్నాప్ నుంచి బయట పడటంతో శిశువు తల్లి లక్ష్మీ తిరుపతమ్మ, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు రంగంలోకి దిగి వైద్యశాలలోని సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా కిడ్నాప్‌కు యత్నించిన మహిళను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీ నేటి నుంచి
నెహ్రూ నగర్ (గుంటూరు తూర్పు): నూతన సంవత్సరంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పింఛన్‌దారులకు తీపి కబురు అందజేస్తూ రూ.2500 నుంచి 2750కు పెంచిన పెన్షన్లు లబ్ధిదారులకు వలంటీర్లు అందజేయనున్నారు. గుంటూరు జిల్లాలో ఆదివారం 2,56,915 మంది లబ్ధిదారులకు రూ.70.59 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.



2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ రాష్ట్రాల నర్సింగ్ విద్యార్థినులు

నూత్న వత్సరమా..
మరో కొత్త ఏడాది అందరి ముగింటకు వచ్చేసింది. సరికొత్త ఆశలను రేకెత్తింప చేసింది. ఏయేటికాయేడు వచ్చి వెళ్లిపోయేదైనా ఉన్నన్నాళ్లు హాయిగా.. ఆనందంగా.. తమ జీవనయానం కొనసాగేలా... మంచి ఆలోచనలతో అడుగులు వేసేలా చూడమంటూ నూత్న వత్సరాన్ని సమష్టిగా స్వాగతించారు. ఇంటిముంగిట నయన మనోహరంగా రంగవల్లికలు వేసి ప్రేమపూర్వకంగా కొత్త ఏడాదికి ఆహ్వానం పలికారు. సంవత్సరమంతా ఆనందమయం కావాలని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని.. మిఠాయిలు పంచుకుని ఆనందించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఈ వేడుకలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్ల దృశ్యాలు శనివారం సాయంత్రం అందర్నీ ఆకట్టుకున్నాయి –సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



గుంటూరులో డ్రై ఫ్రూట్స్, కేకులు కొనుగోలు చేస్తున్న నగరవాసులు

ధాన్యరాసులు - ధనరాసులు!

- ధాన్యం కొనుగోళ్లలో సరికొత్త చరిత్ర
- కొనుగోళ్లు అయిన వెంటనే రైతుఖాతాలో నగదు జమ
- జిల్లాలో 12 మండలాల్లో ఇప్పటికే కొనుగోళ్లు ప్రారంభం
- ధాన్యం కొనుగోళ్ల కోసం సిద్ధంగా రూ. 3.63 కోట్లు
- ఇప్పటి వరకు 5500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాలో ఇప్పటికే రూ. 82 లక్షలు జమ
- 10 రోజుల వ్యవధిలోనే రైతు ఖాతాల్లో నగదు జమ

సాక్షి, బాపట్ల : దేశానికి వెన్నెముక రైతు. అలాంటి రైతు సుభిక్షంగా ఉన్నప్పుడే రాష్ట్రం పచ్చని పైర్లతో కళకళలాడుతుందనే విషయాన్ని గ్రహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులకు అన్నివిధాల వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. పంటల సాగు మొదలుకుని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సబ్సిడీ ధరలకు అందించి రైతులపై తమకున్న ప్రేమను చాటుకున్నారు. రైతులు పండించిన పంటలను వారి ముంగిట్లోనే గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసి వారికి అండగా నిలిచారు. తాజాగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబర్ మొదటి వారం నుండే కొనుగోలు ప్రారంభం కాగా, 10 రోజుల క్రితం ధాన్యాన్ని విక్రయించిన రైతులకు సైతం వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయటం విశేషం. ఇప్పటికే సుమారు రూ. కోటి మేరా రైతుల ఖాతాల్లో జమ చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రైతులు సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

గిట్టుబాటు ధర

రైతులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరను పెంచింది. గతంలో సాధారణ రకం క్వింటా రూ. 1940 ఉండగా ప్రస్తుతం రూ. 2040 చేసింది. అదే విధంగా ఏ గ్రేడ్ రకం గతంలో రూ. 1960 ఉండగా ప్రస్తుతం రూ. 2060కు పెంచింది. ధాన్యం కొనుగోలుకు అవసరమైన సంచులను ప్రభుత్వమే సమకూరుస్తోంది.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్

ఊపందుకున్న కొనుగోళ్లు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసింది. జిల్లా వ్యాప్తంగా 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 25 మండలాల్లో మొత్తం 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకోగా ప్రస్తుతం 12 మండలాల పరిధిలో కొనుగోళ్లు మొదలు పెట్టారు. గడిచిన వారం రోజుల్లో 5500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం తాలుకా రైతులకు ఇప్పటికే రూ. 82 లక్షలు రైతుల ఖాతాల్లో జమచేశారు. మిగిలిన మొత్తాన్ని ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు చేపట్టారు. జిల్లాలో 153 రైతు భరోసా కేంద్రాలు ఉండగా వరి కోతలు ముగిసిన వాటిల్లో ధాన్యం సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. రోజురోజుకు కొనుగోళ్లు మరింత వేగవంతమైంది.



ధాన్యపు రాసులు ఆరబెడుతున్న రైతులు

దళారీ వ్యవస్థకు చెక్ !

గత ప్రభుత్వ హయాంలో ఆరుగాలం కష్టించి పండించిన అన్నదాతలకు దళారుల అక్రమాల పుణ్యమాని అష్టకష్టాలు తప్పేవి కావు. దళారులు, మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి వారికి నచ్చిన రేట్లను నిర్ణయించి రైతులను నిలువు దోపిడీ చేసేవారు. రైతుల కష్టాలను స్వయంగా చూసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర నేరుగా రైతు ఖాతాలో జమయ్యేలా చర్యలు చేపట్టి అక్రమాలకు చెక్ పెట్టింది.

10 రోజుల్లో డబ్బులిచ్చారు



నాకు చుండూరు రెవెన్యూ పరిధిలో 1.25 ఎకరాల భూమి ఉంది. దీంతో పాటు నేను మరో రెండు ఎకరాలు కౌలుకు సాగుచేసుకున్నా. నేను పండించిన 97 బస్తాల ధాన్యాన్ని ఈనెల 16న రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయించుకున్నా. నాకు ఈనెల 26న రూ.1,45,302 ప్రభుత్వం జమచేసింది. ధాన్యం అమ్మిన పదిరోజుల్లోనే డబ్బులు రావడం చరిత్రలో మేము ఎన్నడూ చూడలేదు. దళారులు లేకుండా చేయడం వలన ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర నేరుగా మాకు అందింది.

–కారుమూరి శ్రీధర్‌రెడ్డి, చుండూరు

సిద్ధంగా రూ. 3.63 కోట్లు



జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి వెంటనే నగదు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే 10 రోజుల క్రితం వరకు ధాన్యం విక్రయించిన రైతులకు రూ. 82 లక్షలు వారి ఖాతాల్లో జమ చేయటం జరిగింది. వీటితోపాటు రైతులకు జమ చేసేందుకు రూ. 3.63 కోట్లు నిధులు సిద్ధంగా ఉన్నాయి. ధాన్యం విక్రయించిన రైతులకు నగదు వెంటనే నగదు జమయ్యేలా చూస్తున్నాం.

– వి. శ్రీలక్ష్మి, మేనేజర్, జిల్లా పౌరసరఫరాలశాఖ

అగ్రస్థానం గుంటూరుదే!
పన్ను వసూళ్లల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానం

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): 2022–23 రెండో అర్థ సంవత్సరం పన్ను వసూళ్లల్లో గుంటూరు నగర పాలక సంస్థ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. గత ఏడాది 30,31వ తేదీల్లో రూ.3.27 కోట్లు వసూలు చేయగా ఈ ఏడాది 30.31వ తేదీల్లో రూ.7.50 కోట్లు రికార్డు స్థాయిలో వసూలు చేశారు. శనివారం ఒక్కరోజే రూ.5.25 కోట్లతో రాష్ట్రంలోనే గుంటూరు మొదటి స్థానంలో నిలిచిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. పన్ను వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ ద్వారా మంచి ఫలితాలు సాధించామని, పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.

సాగర్ నీటిమట్టం వివరాలు
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 580.50 అడుగుల వద్ద ఉంది. ఇది 284.4570 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 8,831, ఎడమకాలువకు 8,367, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,282, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరదకాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 27,680 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్
- గుంటూరు జిల్లా వింజనంపాడు జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడిపై వేటు
- విద్యార్థులను కొడుతున్నారంటూ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు
- విచారణ జరిపిన విద్యాశాఖాధికారులు
- అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లినందుకు మరో టీచరుపైనా వేటు

గుంటూరు ఎడ్యుకేషన్: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ గుంటూరు డీఈవో పి.శైలజ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులను ఇష్టమొచ్చినట్లు కొడుతున్నారంటూ గత సోమవారం వింజనంపాడు జెడ్పీ హైస్కూల్‌కు స్థలాన్ని ఇచ్చిన దాత చిరుమామిళ్ల చౌదరితో పాటు పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డికి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డీవైఈవో ద్వారా విచారణ జరిపిన డీఈవో శైలజ శనివారం స్వయంగా పాఠశాలను సందర్శించారు. కాగా విద్యార్థులను దుర్భాషలాడి, కొట్టిన సంఘటనలో బాధ్యుడైన స్కూల్ అసిస్టెంట్ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు ఒక్కరినే సస్పెండ్ చేయాల్సి ఉండగా, పాఠశాలలో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయురాలు వారం రోజుల క్రితం అనారోగ్యం కారణంగా సెలవు పెట్టి, ప్రభుత్వ అనుమతి లేకుండా దుబాయ్ వెళ్లిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో విద్యార్థులను దుర్భాషలాడి, కొట్టినందుకు గణితశాస్త్ర ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును, ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లినందుకు జీవశాస్త్ర ఉపాధ్యాయిని ఎలిజబెత్ రాణిని సస్పెండ్ చేశారు.

జూనియర్ కళాశాలల గుర్తింపు దరఖాస్తు గడువు పొడిగింపు
గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండేళ్ల ఇంటర్మీడియెట్ కోర్సులు అందిస్తున్న అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలలు 2023–24 విద్యాసంవత్సరానికి గుర్తింపు రెన్యువల్ కోరుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువును ఇంటర్మీడియెట్ బోర్డు ఈనెల 10వ తేదీకి పొడిగించినట్లు ఆర్ఐవో జి.సునీత శనివారం తెలిపారు. అదే విధంగా అదనపు సెక్షన్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీటితో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరంలో గుర్తింపు మంజూరు ఫీజును చెల్లించేందుకు తుది గడువు ఈనెల 4న ముగియనుందన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

సంతోషాల సంవత్సరం



మంత్రి మేరుగ నాగార్జున

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గంలోని ప్రజలందరికీ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. న్యూఇయర్ వేడుకలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాల లబ్ధి అందరికీ చేకూరనుందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు అమలు చేయాలని ఆకాంక్ష.

ప్రజలకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు



మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆలోచనలు, మంచి నిర్ణయాలతో నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మంచి బాటలో, చెడుకు దూరంగా అభివృద్ధి పథంలో కొనసాగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పాలన సాగుతోందని చెప్పారు.

కొత్త లక్ష్యాలతో వెళ్దాం



మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శనివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ కొత్త లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. వేడుకలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే విధంగా ఉండాలని సూచించారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా రంజక పాలనలో జిల్లా ప్రజలు సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో సుభిక్షంగా ఉన్నారని చెప్పారు. జిల్లా పరిషత్ పాలనలో సహకారం అందిస్తున్న జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికార యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు.





నకిలీ పాస్ పుస్తకాల తయారీ ముఠా అరెస్ట్

- స్టాంపులు, ఆధార్, పాస్‌పుస్తకాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ అశోక్‌కుమార్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో నకిలీ డ్యాకుమెంట్లు, పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులు, దొంగ స్టాంపులు తయారు చేసి ఖాళీగా ఉన్న స్థలాలను అగ్రిమెంట్లు చేయించుకొని విక్రయిస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ అశోక్‌కుమార్ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వినుకొండ రూరల్ మండలం జాలలపాలెం గ్రామానికి చెందిన సురభి వెంకటేశ్వర్లు, నేరెళ్ల వెంకట పాపారావు పేరుతో వెంకుపాలెంలో ఉన్న 6.75 ఎకరాల భూమిని అగ్రిమెంటు రాసినట్లు నకిలీ డ్యాకుమెంట్లు తయారు చేసి దేరంగుల శ్రీనివాసరావు, కుందనపు సూర్యనారాయణలకు రూ.15లక్షలకు విక్రయించాడు. అలాగే చల్లా నాగేంద్రం పేరుతో నకిలీ డ్యాకుమెంట్ల సృష్టించి 2.4 సెంట్ల భూమిని కూడా వారికే విక్రయించాడు. అయితే భూమిని కొనుగోలు చేసిన కుందనపు సూర్యనారాయణ, దేరంగుల శ్రీనివాసరావు రిజిస్ట్రేషన్ చేయమని అడగడంతో చల్లా నాగేంద్రం ద్వారా సక్రమించినట్లు చెప్పి 2.4సెంట్లను వారి పేరుతో జీపీ కింద రిజిస్ట్రేషన్ చేశారు. అయితే తన భూమి తనకు తెలియకుండా నకిలీ డ్యాకుమెంట్లు సృష్టించి అమ్మినట్లు తెలుసుకున్న నేరెళ్ల వెంకటపాపారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడిగా ఉన్న సురభి వెంకటేశ్వర్లు తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఆర్డీఓ పేర్లతో స్టాంప్‌లు కూడా తయారు చేయించడమే కాకుండా నకిలీ ఆధార్‌కార్డు సృష్టించి తన పేరుతో డ్యాకుమెంట్లు తయారు చేయించుకొని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే నిందితుడి వద్ద వందల కొద్ది డ్యాకుమెంట్లు, రెవెన్యూ రికార్డులు ఉన్నాయి. నిందితుడిపై గతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, మోసాలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు వివరించారు. అతడికి సహకరిస్తున్న బత్తుల లక్ష్మీనారాయణ, ఓర్సు శ్రీనులపై కూడా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్‌ఐలు రాజ్యలక్ష్మి, చెన్నకేశవులు ఉన్నారు.



విలేకరులకు నిందితులను చూపుతున్న సీఐ అశోక్‌కుమార్

సచివాలయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



బాపట్ల: గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా బాపట్ల పట్టణానికి చెందిన కె.నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఎండీ జానీపాషా షేక్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. నాగరాజు బాపట్ల పట్టణం రెండో సచివాలయంలో వెల్ఫేర్ కార్యదర్శిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నాగరాజు మాట్లాడుతూ జనవరి 15 నాటికి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజును పలువురు సచివాలయ ఉద్యోగుల అభినందించారు.





ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

చినగంజాం: ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌లో సీఐ వీ సూర్యనారాయణ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. బల్లికురవ మండలం కొమ్మినేని వారిపాలెం గ్రామానికి చెందిన కీర్తిపాటి శ్రీనివాసరావు ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే ఉద్యోగం నుంచి తొలగించగా మద్యం పేకాట వంటి వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఏవిధంగానైనా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ద్విచక్రవాహనాలను దొంగిలిచటం మొదలు పెట్టాడు. ఇంకొల్లు, మార్టూరు, మేదరమెట్ల, నరసరావుపేట, చిలకలూరిపేట, విజయవాడలలో ద్విచక్ర వాహనాలను దొంగతనాలకు పాల్పడ్డాడు. పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు ఇంకొల్లు ఎస్సై ఎస్కే నాయబ్ రసూల్ సిబ్బంది సాయంతో స్థానిక పావులూరు ఆంజనేయస్వామి గుడి వద్ద అతనిని పట్టుకొని విచారించారు. అతని వద్ద నుంచి సుమారు రూ.5 లక్షలు విలువ కలిగిన 9 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. కేసులో ప్రతిభ కనబరచిన సీఐ, ఎస్సై, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వసంతరావు, డీ రవి, కానిస్టేబుల్ నాగూర్, బాలచంద్ర, డీ శ్రీనివాసరావులను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

పంట కోత ప్రయోగంతో అన్నదాతలకు మేలు

శావల్యాపురం: వరి పంట కోత ప్రయోగం వలన దిగుబడులు అంచనా వేయటంతో పాటు ఉత్పత్తులు ఆధారంగా రైతులకు బీమా సౌకర్యం కల్పించటానికి దోహదపడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఇంగిరాల మురళీ అన్నారు. శనివారం మండలంలోని శానంపూడి రెవెన్యూ గ్రామపరిధిలో వరి పంట సాగు చేసిన రైతు పొలంలో ప్రయోగం నిర్వహించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.